

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి -జిమాడుగుల:మండలంలోని బోయితిలి పంచాయతీ కేంద్రంలో ఆంధ్ర వానవాసి కళ్యాణ్ ఆశ్రమ్ ద్వారా ఉచిత వైద్యశిబిరం శనివారం ఏర్పాటు చేశారు, ఈ శిబిరన్ని స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వీరభద్రరావు ప్రారంభిచారు. ఈ సందర్భంగా వైద్యధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, వండిన ఆహారపదార్ధాములను చేయితో వేయరాదని, గరిటెలు వాడాలన్నారు.మలేరియా ప్రభావిత ప్రాంతాలలో దోమతెరాలు వాడాలని, మత్తుపానియాలు తగ్గించి పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు.ఈ మెడికల్ క్యాంపులో స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యులు

పోలవరం నిర్వాసితుల గోడు పట్టదా?

- ★ నష్టపరిహారం చెల్లించిన తరువాతే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి
- ★ నాణ్యతా లోపంతో పునరావాస కాలనీలు
- ★ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించకుంటే ఉద్యమం మరింత తీవ్రతరం
- ★ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-దేవీపట్నం

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల గోడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. దేవీపట్నం మండలంలోని చిన్నారిగండి కాలనీ, పెనికిలపాడు, సీతారాం కాలనీ తదితర ప్రాంతాల్లో శ్రీనివాసరావు నేతృత్వంలో సిపిఎం బృందం శుక్రవారం పర్యటించింది. పోలవరం నిర్వాసిత కాలనీలవాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం ప్రాజెక్టు కట్టడం కోసం మాత్రమే ఆలోచిస్తున్నాయని, ఈ ప్రాజెక్టు కోసం తమ సర్వస్వాన్ని వదులుకొని ఉన్న నిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారంపై మాత్రం వారికి ఏమాత్రం పట్టడం లేదని పేర్కొన్నారు. వారికి రావలసిన నష్టపరిహారం కూడా సరైన పద్ధతిలో ఇవ్వలేదన్నారు. నిర్వాసితులకు నిర్మించిన పునరవాస కాలనీల్లో కూడా కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఈ ఇళ్లు వర్షానికి కారిపోతున్నాయని, బాత్రూములు నేల సదును చేసి మట్టి తోలకొండ పల్లంగా కట్టడంతో వర్షపు నీరు బాత్రూంలోకి వచ్చేస్తుందని కాలనీ నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. వర్షాకాలం వస్తే ఈ కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోనుందని పేర్కొన్నారు. తాగునీరు కూడా కల్పించలేదన్నారు. ముందుగా పోలవరం నిర్వాసితులకు ఇవ్వవలసిన నష్టపరిహారాన్ని వాళ్లకి ఇచ్చి ఆ తరువాతే ప్రాజెక్ట్ కోసం ఆలోచించాలని హితవుపలికారు. నిర్వాసితులందరూ ఐక్యంగా ఒక కమిటీగా ఏర్పడి ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీద్దామని, అవసరమైతే ఐటిడిఎ ముట్టడిద్దామని నిర్వాసితులకు పిలుపునిచ్చారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల ప్యాకేజీ విషయాలలో చాలా అన్యాయం జరిగిందన్నారు. అందరూ కలిసికట్టుగా ఉంటే ఏదైనా సాధించగలుగుతామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోత రామారావు, రంపచోడవరం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు శాంతరాజు, నిర్వాసితులు పాల్గొన్నారు.


దేవీపట్నం మండలం పునరావాస కాలనీలో నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విఆర్.పురం : మండలంలోని రామవరం గ్రామంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో ఆ పార్టీ బృందం శుక్రవారం పర్యటించింది. ఈ సందర్భంగా స్థానికులు సిపిఎం నాయకులు ఎదుట తమ గోడు ఏకరుపెట్టారు. 2022లో పోలవరం బ్యాక్ వాటర్ వల్ల చెరువుకు గండి పడగా నేటికీ పూడ్చలేదని తెలిపారు. చింతూరు విఆర్ పురం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు మధ్యలో తూములు కృంగిపోయి నీరు కూడా రావడం లేదని చెప్పారు. ఈ సమస్యను సంబంధిత అధికారులకు తెలిసినా, రెండేళ్లగా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ మీరు తెలిపిన విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, జిల్లా నాయకులు లోతా రామారావు మట్ల వాణిశ్రీ , మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, ఎంపీపీ కారం లక్ష్మి, మండల నాయకులు పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలోని రాయనపేట, నర్సింగపేట పునరావాస కాలనీలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, ఆ పార్టీ నాయకులు శుక్రవారం సందర్శించారు. అక్కడ నివాసం ఉంటున్న గొందూరు, కొటారిగొమ్ము, శ్రీరామగిరి గ్రామల నిర్వాసితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోత రామారావు, మర్లపాటి నాగేశ్వరరావు, మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు ఐవి, కాకా అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


ఎటపాక మండలం నర్సింగపేట పునరావాస కాలనీలో నిర్వాసితుల సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు


విఆర్.పురం మండలం రామవరంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం


బురదరోడ్డుపై నడుస్తున్న ప్రజా ప్రతినిధులు

మన్యంలో భారీ వర్షం

- పొంగుతున్న గెడ్డలు, ఛిద్రమైన రహదారులు

ప్రజాశక్తి- చింతపల్లి: గత వారం రోజుల నుంచి కురుస్తున్న విపరీత వర్షాలతో పల్లెలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎంపీపీ కోరాబు అనూష దేవి, ఎంపీడీవో సీతామహాలక్ష్మి శుక్రవారం బలపం పంచాయతీ పరిధిలోని చెరువూరు, తడ్డపల్లి, గిల్లేలుబంద గ్రామాలకు వెళ్లి రోడ్ల పరిస్థితి, వాగులను పరిశీలించారు. లోతుగడ్డ వంతెన నుండి మూల కొత్తూరు వరకు 8 కిలోమీటర్ల రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఈ మార్గాన్ని బలపం, కడుముసారి పంచాయతీ గ్రామాలే కాకుండా ఒడిశా సరిహద్దు గ్రామస్తులు కూడా వినియోగిస్తారు. రహదారి పునరుద్ధరణకు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను నివేదిక అందిస్తామని, ప్రజలు సురక్షితంగా ప్రయాణం చేయాలని కోరారు. ఈ పర్యటనలో జెడ్పిటిసి పోతురాజు బాలయ్య, సర్పంచ్ రమేష్ నాయుడు, ఏపీఓ, నాయకులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: మండలంలో శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. తెల్లవారు ఉదయం నుంచి సాయంత్రం వరకు చలి గాలులతో కూడిన వర్షం కురవడంతో గిరిజనులు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం అరుకులో జరిగిన వారపు సంత వర్షపు నీటితో పూర్తిగా బురదమయంగా మారడంతో సంతకెళ్లిన గిరిజనులు కొనుగోలుదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. కితలంగి, పెదపాడు, గోరపూరు గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.



ప్రారంభిస్తున్న కలెక్టర్

క్షయ నిర్మూలనకు సహకరించండి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరుటౌన్:టి.బి రహిత భారత్ కు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ కోరారు. . జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ టీబీ వ్యాధి పట్ల శ్రద్ధ వహించాలని, దగ్గు మాత్రమే టీబీ వ్యాధి లక్షణాలు కావని అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో టీబీ వ్యాధి లక్షణాలు తెలుపుతున్న సెల్ఫీ స్టెండ్, ప్రచార గోడ ప్రతిని జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, ట్రైయిని కలెక్టర్ కె.సాహిత్, జిల్లా అధికారి కె.పద్మలత, జిల్లా టిబి కంట్రోలింగ్ ఆఫీసర్, డిపిఎంఓ ఎం. కిరణ్ కుమార్, సిసి కిరణ్, వైద్య సిబ్బంది ఉన్నారు.


ఆసుపత్రి వైద్యాధికారితో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం సీతపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ప్రాజెక్ట్ అధికారి ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. జ్వరాలతో వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు చేసి రక్త నమూనాలు స్వీకరించి ఆయా వ్యాధులకు సంబంధించిన మందులు ఉచితంగా అందజేయాలని కోరారు. సీతపల్లి ఆసుపత్రి పరిధిలో గర్భిణులు, బాలింతలు ఎంతెంత మంది ఉన్నారో ఆరా తీశారు. ప్రతిరోజు సుమారు ఎంతమంది అవుట్ పేషెంట్లు వస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

కూలిన భారీ వృక్షం

తెగిపడిన విద్యుత్ తీగలు - తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధిమండలం దారకొండ పంచాయతీ గుమ్మిరేవుల ప్రధాన రహదారి సాధుపాకల గ్రామ సమీపంలో రహదారి పక్కన భారీ వృక్షం కూలి విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా తీవ్ర అంతరాయం ఏర్పడింది. అటుగా వెళుతున్న గ్రామస్తులు దారకొండ సబ్ స్టేషన్ ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. భారీ వృక్షం కూలిపోవడంతో తెల్లవారుజాము నుంచి రాకపోకలకు అంతరయం ఏర్పడింది. కమ్మరి తోట సాధుపాకల గ్రామస్తుల సహకారంతో భారీ వృక్షాన్ని తొలగించి రాకపోకలు కొనసాగించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


రోడ్డుకు అడ్డంగా కూలిపోయిన భారీ వృక్షం

గిరిజన హక్కుల రక్షణ అందరి బాధ్యత

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

ప్రజాశక్తి -పాడేరు: గిరిజనుల హక్కులకు రక్షణ కల్పించాల్సిన భాద్యత మనందరిపై ఉందని జిల్లా న్యాయం సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక కాఫీ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, గిరిజన ప్రాంత పారా లీగల్ వాలంటీర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, గిరిజన యువత ఇతర స్టేట్ హోల్డర్స్‌కు న్యాయ సేవల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.ఎస్.సన్యాసి నాయుడు అధ్యక్షత వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, దామోదర సంజీవయ్య న్యాయ కళాశాల వైస్ ఛాన్సలర్ సూర్య ప్రకాష్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ తో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జ్ మాట్లాడుతూ, గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలకు ఒక ప్రత్యేకత ఉందని తెలిపారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు.

జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలకు భద్రత కల్పించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. సమన్వయంతో ముందుకు సాగితే సమస్యలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఇటువంటి శిక్షణా తరగతులతో ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ, గిరిజనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో జ్యూడిషయల్ సిస్టమ్ ఉందన్నారు. అందరిలో అవగాహన కల్పించడానికే ఈ శిక్షణ అని పేర్కొన్నారు. అతి తక్కువ వ్యయంతో డిఎల్ఎసి ద్వారా న్యాయం పొందవచ్చని సూచించారు. ఘంలో ఉండే ప్రతీ పౌరుడితో సామరస్యంగా స్నేహభావంతో ఉండాలన్నారు. దామోదర సంజీవయ్య న్యాయ కళాశాల వైస్ ఛాన్సలర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో రక్షణ కల్పించడానికి ఈ శిక్షణా చాలా ఉపయోగపడుతుందని అన్నారు. పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఇటువంటి కార్యక్రమం చేపట్టడం మంచి శుభపరిణామం అన్నారు. మాస్టర్ ట్రెయిని ఆర్.శ్రీనివాసరావు, దామోదర సంజీవయ్య లా కళాశాల వైస్ ఛాన్సలర్ సూర్య ప్రకాష్‌లు సందేహాలు నివృత్తి చేసారు. ఈ శిక్షణా తరగతుల్లో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విశ్వేశ్వరనాయుడు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఝాన్సీ భాయ్, జిల్లా లేబర్ ఆఫీసర్ సుజాత, జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు, డ్వామా పిడి విద్యాసాగర్, విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సహాయ సంచాలకులు కె.కవిత, అంగన్వాడీ వర్కర్స్, ఆశా వర్కర్స్, పారా లీగల్ వాలంటీర్లు, పానేల్ అడ్వకేట్స్, యువతీ యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి సన్యాసినాయుడు

స.హ చట్టంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-పాడేరు:: సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా సహకార అధికారి ఎం.వి. రామకృష్ణ రాజు అన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్, రాష్ట్ర సహకార సంఘముల కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార శాఖ అధికారులు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహనా కార్యక్రమాన్ని ఈనెల 24, 25 తేదీల్లో నిర్వహించారు. జిల్లా సహకార అధికారి ఎం వి రామ కృష్ణ రాజు సమాచార హక్కు చట్టము 2005 పై అవగాహన కల్పించారు. ఆర్టిఐ యాక్ట్ ముఖ్య ఉద్దేశ్యంను వివరించారు.ఈ సదస్సులో జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్స్ పి ఇందిర లావణ్య, పి.సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి-అనంతగిరి:యుటిఎఫ్ సంఘం సభ్యత్వంతోనే బలోపేతం అవుతుందని ఆ సంఘం అల్లూరి జిల్లా కార్యదర్శి పుడిగి. దేముడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లుంగపర్తి ప్రాథమిక పాఠశాలలో సభ్యత్వం కార్యక్రమం చేపట్టామన్నారు. ఉపాధ్యాయులు సభ్యతాలు చేసుకోవాలని ఆయన కోరారు. యుటిఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడటానికి ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యవర్గ సభ్యులు టి.బాకృష్ణ, దేవుడు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై కళా జాతా

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని తీగల వలస పంచాయతీ పరిధిలో శుక్రవారం స్వచ్ఛభారత్, ఆరోగ్య అంశాలపై కళా జాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.కళాజాతా బృందం పాటల ద్వారా అవగాహన కల్పిచారు. చెత్త ఇల్లు చుట్టుపక్కల వేస్తే దోమలు సంచరిస్తాయని, వీటితో వ్యాధులు వస్తాయన్నారు. పంచాయతీ సర్పంచ్ పాంగి బేసు, పంచాయతీ కార్యదర్శి పి. సాగర్, ఆదివాసీ ఫెలోషిప్ కన్వీనర్ కామరాజు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

స్పెషల్ డిఎస్‌సిపై సిఎం స్పష్టమైన ప్రకటన చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీపై ఆదివాసీ రిజర్వేషన్ అమలుపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయించాలని ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ ఆదివాసి నిరుద్యోగుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం పాడేరు లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్ సత్యనారాయణ, స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ జిల్లా కన్వీనర్ సాగిన ధర్మాన పడాల్, కో. కన్వీనర్ కూడ రాధాకృష్ణ మాట్లాడుతూ... 5షెడ్యూల్ ప్రాంతంలో 100శాతం ఉద్యోగ నియామక చట్టం చేయాలని, అంతవరకు మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ప్రాంత పోస్టులు మినహించి స్పెషల్ డిఎస్సి ద్వారా ఏజెన్సీ టీచర్ పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. సాధన కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 22 తేదీ నుండి చేస్తున్న ఉద్యమంలో భాగంగా మండలాల్లో నిరశనలు, మే 30న ఐటిడిఎ ముట్టడి, మే ఒకటో తేదీన రంపచోడవరం లో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, మే 2 .3 తేదీలలో రాష్ట్ర మన్యం బంద్ నిర్వహించినప్పటికీ ప్రభుత్వం తాత్సార వైఖరి కొనసాగుతోందని విమర్శించారు. ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ పోరాట ఫలితంగా మే 13వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటన చేశారని పేర్కొన్నారు. 100శాతం ఉద్యోగ నియమక చట్టం చేయడానికి అంగీకరించడం జరిగిందని సిఎం ప్రకటన చేశారన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. దీనిపై ఈనెల 28వ తేదీన రాష్ట్ర సదస్సు పాడేరులో నిర్వహిస్తున్నామన్నానీ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి నిరుద్యోగుల సంఘం నాయకులు బి రామకృష్ణ పడాల్, డిపి శంకర్ ఎం విష్ణుమూర్తి, వినయ్, రాజం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్, తోటి ఉద్యోగులు

ప్రజాశక్తి-చింతపల్లి: పెదబరడ గ్రామ సచివాలయ సిబ్బందిని శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి బొలేం లక్ష్మి ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్ హాజరై ప్రసంగిస్తూ, సచివాలయ సిబ్బంది గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎప్పటికీ మరిచిపోలేని కృషి చేశారన్నారు. పేద, బలహీన వర్గాల సమస్యలను అర్థం చేసుకొని సకాలంలో పరిష్కరించారన్నారు. ఉద్యోగులకు గుర్తుగా శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ విభాగాల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జీకేవీధి: మండలంలో పెదవలస పంచాయతీ సచివాలయంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ వైస్ ఎంపీపీ ఘనంగా సన్మానించారు. పెదవలస పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులు పంద్ర నూకరాజు మాట్లాడుతూ, వృత్తిరీత్యా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సర్పంచ్, వైస్ ఎంపీపీ సప్పగడ్డ ఆనందరావు, పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులు పంద్ర నూకరాజు, సెక్రెటరీ కె బాలకృష్ణ సత్కరించారు.

గిరిజనుల మధ్య చిచ్చుకు కుట్ర



మీడియాతో మాట్లాడుతున్న వాల్మీకి సంక్షేమ సంఘం నాయకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: వ్యక్తిగత, స్వార్ధ ప్రయోజనాల కోసం అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్న ఆదివాసీ, గిరిజనుల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్రలు పన్నుతారని ఆదివాసి వాల్మీకి సంక్షేమ సంఘం నాయకులు మండిపడ్డారు. విడగొట్టి, రాజకీయాలు చేయాలని చూడడం సరికాదని హెచ్చరించారు. శుక్రవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని పిఎంఆర్ సి భవనంలో రిటైర్డ్ ఐఎస్ అధికారి డాక్టర్ తమర్బా బాబూరావు నాయుడు రాసిన "ఉనికిని కోల్పోతున్న ఆదివాసీలు" పుస్తకంపై సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు, ఆదివాసి వాల్మీకి సంక్షేమ సంఘం నేతలు ఓంద్రు రామ్మూర్తి, కిముడు రామారావు, కొక్కుల రామారావు, ఓలేసు రామలింగం తదితరులు మీడియాతో మాట్లాడారు. ఆదివాసీల ఐక్యతను దెబ్బతీసేందుకు పుస్తకం రూపంలో కుటిల పన్నాగం పన్నిన బాబురావు నాయుడు గిరిజనుల అభివృద్ధికి ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పుస్తకంలో గిరిజన వర్గాల గురించి, ముఖ్యంగా వాల్మీకి సమాజం గురించి తప్పుడు సమాచారం ఉందని, విద్వేషాలను రేకెత్తించే అంశాలు ఉందని ఆరోపించారు. ఆదివాసీల మనోభావాలను దెబ్బతీసే పుస్తకాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పుస్తక పంపిణీ తదుపరి ప్రచురణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐఎస్ అధికారిగా రాసిన పుస్తకంలో ఆ స్థాయిలో ఉన్నత ప్రమాణాలు పాటించకుండా, తోటి ఆదివాసీలను అగౌరపరిచేలా సత్యానికి దూరంగా, తప్పులు తడకగా ఉండడం చాలా విచారకరమన్నారు.

పరిహారం పొందిన పోలవరం భూములు

పేద గిరిజనులకే దక్కాలి

ఆదివాసీల పోరాటానికి వ్యకాస రాష్ట్ర నేత మర్లపాటి మద్దతు



గిరిజనులతో మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర నేత మర్లపాటి

ప్రజాశక్తి-ఎటపాక : పోలవరం నష్టపరిహారం పొంది భూస్వాముల ఆధీనంలో ఉన్న భూములు పేద గిరిజనులకే దక్కాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని నందిగామలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జరుగుతున్న భూ పోరాట కేంద్రాన్ని మర్లపాటి నాగేశ్వరరావు, పిఎన్ఎమ్ రాష్ట్ర నాయకులు ఐవీ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2007లో తమ భూములు పోలవరంకు ఇచ్చి పరిహారం పొందిన భూస్వాములు, జమీందారులు వాటిని తమ గుప్పెట్లో ఉంచుకొని వేలకు వేలు కౌలుకు ఇస్తూ అనుభవిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములుగా ఉన్న ఈ భూములను గిరిజనులు సాగు చేసుకుందామని జెండాలు వేస్తే వాటిని సహించలేని భూ స్వాములు గిరిజనులపై కేసులు పెట్టేందుకు సిద్ధపడ్డారని పేర్కొన్నారు. పరిహారం పొందిన భూములు తమవే అని తప్పుడు సమాచారంతో అధికారులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అంతేగాక అధికారులను గిరిజనులపైకి ఉసిగోల్పుతున్నారన్నారు. ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటూ ప్రభుత్వ భూముల్ని కౌలుకు ఇస్తున్న భూస్వాములపై కేసులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. నష్టపరిహారం పొందిన స్థానిక గిరిజనేతర చిన్న రైతులు భూముల జోలికి తాము వెళ్లడం లేదని తెలిపారు. గిరిజన సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న ఈ భూ పోరాటానికి చిన్న సన్న కారు రైతులు తమ మద్దతు తెలియజేస్తున్నారని చెప్పారు. ఆదివాసీల భూ పోరాటానికి వ్యతిరేకంగా, భూస్వాములకు అనుకూలంగా వ్యవహరిస్తున్న కొందరు స్థానిక నేతలు తమ పద్ధతి మార్చుకోవాలని, స్థానిక ఆదివాసీల పోరాటానికి మద్దతు పలకాలని హితవు పలికారు. ఉద్యమం ప్రారంభ దశలోనే ఉందని ఇకపై నిర్బంధాలు ఉండొచ్చని సంఘటితమై పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు కాక అర్జున్ దొర, సొండే రామారావు, పర్సిక ధర్మరాజు, పెదబాబు, రాఘవపురం , ఎర్రగట్టు, మురుమూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీ భాషలో శిక్షణ

ప్రజాశక్తి-రంపచోడవరం : జిఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేసిన ఏజెన్సీలోని గిరిజన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగాలు పొందే విధంగా జర్మనీ భాషలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పిఒ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజన యువతి యువకులు జియన్ఎం, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి జిల్లాలలో ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా సుమారు పది నెలలపాటు జన్మని లాంగ్వేజ్ నేర్చుకునే విధంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి కగిలిన గిరిజన యువత రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్లో ఈనెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు పనులు ప్రారంభించాలని

గుర్రాలతో నిరసన

ప్రజాశక్తి - అనంతగిరి : ఆంధ్రప్రదేశ్‌ను డోలీ రహిత రాష్ట్రంగా మారుస్తామంటూ 'అడవి తల్లి బాట' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రోడ్లకు శంకుస్థాపన చేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా తమ ప్రాంతానికి రోడ్ల నిర్మాణం పూర్తిగా జరగలేదంటూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం గుర్రాలతో మద్రేబు, దాయర్తి గ్రామస్తులు నిరసన తెలిపారు. మద్రేబు నుంచి దాయర్తి, అక్కడి నుంచి గుర్రాల బయలు వరకూ గుర్రాలతో ఈ నిరసన ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కె.గోవిందరావు, పివిటిజిల సంఘం మండల నాయకులు సీదరి ఆనంద్, కె.చిన్నారావు మాట్లాడారు. పినకోట పంచాయతీ పరిధి బల్లగరువు గ్రామంలో డిసెంబర్‌లో పవన్ కల్యాణ్ అట్టహాసంగా రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారన్నారు. నేటి వరకూ పనులు చేపట్టలేదన్నారు. పినకోట, పెదకోట, జీనబాడు పంచాయతీల పరిధిలోని గ్రామాల వాసులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. బల్లగరువు నుంచి వాజంగి, పీచు మామిడి, గుమ్మంతి వరకూ, కోటగరువు మీదుగా దాయార్తి, మద్రేబు నుంచి తునిసీబు గ్రామం వరకూ బిటి రోడ్ల నిర్మాణం కోసం రూ.11.కోట్ల నిధులను కేటాయించినట్టు తెలిపారు. బల్లగరువు నుంచి వాజంగికి తలపెట్టిన పనులకు శంకుస్థాపన కూడా చేశారన్నారు. అక్కడి నుంచి ఆ ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు. దీంతో 11 గ్రామాల్లోని గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రేషన్‌కు వెళ్లాలన్నా సుమారు 24 కిలోమీటర్ల మేర నడక సాగించాల్సి వస్తోందన్నారు. విద్యార్థుల, రోగుల కష్టాలు వర్ణనాతీతమన్నారు. జిల్లా కలెక్టరైనా తమ సమస్యలపై స్పందించాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజున భారీ డోలీ యాత్ర చేపడతామన్నారు. కార్యక్రమంలో కె.సోమన్న, కొండతాంబలి నర్సింగరావు పాల్గొన్నారు.



గుర్రాలతో నిరసన తెలియజేస్తున్న గిరిజనులు

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

కలెక్టర్ దినేష్‌కుమార్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు వినతులు వెల్లువెత్తాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జెసి ఎంజె అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, డిఆర్ఒ కె.పద్మలత సంయుక్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 94 వినతులు స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు.

ఫిర్యాదులు కొన్ని..

హుకుంపేట మండలం పాతకోట పంచాయతీ సిమిలిగుడ గ్రామం నుండి ఎగురూడి గ్రామానికి పిఎం జన్మన్ పథకంలో మంజూరైన రోడ్డు పనులు ప్రారంభించాలని జి.రామారావు వినతి పత్రం సమర్పించారు. ముంచంగిపుట్టు మండలం ఏనుగు రాయి పంచాయతీ మినుములుపుట్టు నుండి సెల్లాము గ్రామం వరకు రింగ్ రోడ్డు నిర్మించాలని ఎంపిటిసి సుబ్బలక్ష్మి దరఖాస్తును అందజేశారు. చింతపల్లి మండలం అంజలి శనివారం పంచాయితీ కోరాబు గ్రామానికి సిసి రోడ్డు నిర్మించాలని గ్రామస్తుడు కూడ చిన్నబ్బాయిదొర దరఖాస్తును అందజేశారు. హుకుంపేట మండలం బూర్జ పంచాయితీ జాకరవలస నుండి సొంటారిపాడు గ్రామానికి సిసి రోడ్డు మంజూరు చేయాలని ఎంపిటిసి మజ్జి హరి వినతిపత్రం సమర్పించారు. పాడేరు మండలం సుండ్రు పుట్టు గ్రామానికి చెందిన ఎస్.పద్మలత పట్టాదారు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు చేశారు. టెంపరరీ సదరం సర్టిఫికెట్ కలిగిన దివ్యాంగులకు పెన్షన్ మంజూరు చేయాలని విఆర్ పురం శబరి దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఎన్.రవి కోరారు. జి మాడుగుల మండలం వంతల పంచాయతీ లక్కుపాడు గ్రామస్తులు నూకరాజు, సునీల్ తదితరులు సంగం జంక్షన్ నుండి లక్కుపాడు గ్రామానికి మట్టి రోడ్డు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ డిసి ఎంవిఎస్ లోకేశ్వరరావు, పిఆర్ ఇఇ టి.కొండయ్య పడాల్, ఆర్అండ్ బి ఇఇ బాల సుందరబాబు, డిపిఒ పిఎస్ కుమార్, జిల్లా ఖజానా అధికారి ప్రసాద్ బాబు, ఎస్ టిఒ కృపారావు పాల్గొన్నారు.

గోమంగి మండలం ఏర్పాటు చేయాలని వినతి

పాడేరు: పెదబయలు మండలంలోని మారుమూల ప్రాంతంగా ఉన్న గోమంగి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని శుక్రవారం మీకోసం సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కి మండల సాధన సమితి నాయకులు సల్లంగి ఉమామహేశ్వరరావు, కూడ రాధాకృష్ణ, కొమ్మ బాలరాజు, కే.పద్మనాభం, కొండలరావు తదితరులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 1983వ సంవత్సరంలో మండలాల విభజన నిర్వహించిందని, . ఆ సమయంలో గోమంగి పంచాయితీకి విద్య, వైద్య, రోడ్డు సదుపాయాలు లేనందున అప్పటి ప్రభుత్వం ఒరిస్సా సరిహద్దు పెదబయలును మండల కేంద్రంగా ఏర్పాటు చేశారని వారు పేర్కొన్నారు. గోమంగిలో ప్రస్తుతం. వైద్య, విద్య రింగురోడ్డు సదుపాయం ఏర్పడ్డాయని, 17 పంచాయితీలు ఉన్నాయన్నారు. మండల కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌలభ్యంగా ఉంటుందని వారు కలెక్టర్కు వివరించారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని టిడిపి మండల అధ్యక్షులు, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు శుక్రవారం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని ఏకలవ్య పాఠశాలలో సుద్ద నీరు వస్తుండడంతో విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగనీరు పంట పొలాల్లోకి వెళ్లి పంట పొలాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు వెళ్లేందుకు రహదారి సదుపాయం కల్పించాలని, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రహదారులు సదుపాయం సక్రమంగా లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందుల నేపథ్యంలో మండలంలోని వయ్యాడు, బూరుగుపల్లి రహదారి డి మల్లవరం రహదారి, అమ్మిరేకుల రహదారి, పూదేడు తదితర రహదారులు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పెద్దిరాజు

గుర్తేడు కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-వై.రామవరం : వై.రామవరం మండలాన్ని రెండుగా విభజించి గుత్తేరు కేంద్రంగా మరో మండలాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీపీ ఆనందరావు, జడ్పిటిసి, వెంకటలక్ష్మి ఎంపీటీసీ ఏ సుబ్బలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్‌లోని ఏడు మండలాల్లో వై.రామవరం పెద్దది కావటం, జనాభా కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. అప్పర్ ఏరియాలో ఉన్న ప్రజలు, వై.రామవరం మండల కేంద్రానికి రావాలంటే అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మారేడుమిల్లి, రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల తదితర ప్రాంతాలను దాటి 150 కిలోమీటర్లు ప్రయాణించి మండలానికి రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కమిటీ వేసిన నేపథ్యంలో గుర్తేడు కేంద్రంగా మండలాన్ని ప్రకటిస్తే, దార గడ్డ, కానివాడా, పాతకోట, పాతకోట బొడ్డకండి, పంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఈ ప్రతిపాదనను వెంటనే ప్రభుత్వానికి పంపించి గుత్తేరు కేంద్రంగా మండలం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

కూనవరం పాఠశాల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కూనవరం: కూనవరం ప్రైమరీ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కొండ ఈశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈశ్వర్లు ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయులు వరలక్ష్మి, వీరయ్యలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల చైర్మన్ దుర్గాభవాని మాట్లాడుతూ స్కూలు ప్రహరీ లోపల ప్రాంతం మొత్తం రహదారికి దిగువన ఉండటం వలన విద్యార్థులు వర్షా కాలంలో నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్థానిక పంచాయతీ వారికి, విద్యాశాఖ ఉన్నతాధికారులకు పదేపదే తెలియజేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. స్కూల్ ప్రారంభమైన దగ్గర నుండి విద్యార్థుల సంఖ్య పెరిగిందని, కాని బియ్యం, గుడ్లు విద్యార్థులకు సరిపడా ఇంతవరకు కేటాయింపు జరగలేదని పేర్కొన్నారు. పైఅధికారులతో మాట్లాడి ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సిపిఎం నేత ఈశ్వర్లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తాళ్లూరు శ్రీనివాసరావు, తలగాని నాగరాజు, గడ్డిపాటి షణ్ముఖరావు, నోముల సత్యనారాయణ, కొండా నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్షౌర వృత్తిదారులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : క్షౌర వృత్తిని నమ్ముకుని తరతరాలగా జీవనం సాగిస్తున్న క్షౌర వృత్తిదారులకు న్యాయం చేయాలని న్యాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం టౌన్ అధ్యక్షులు కె.త్రిమూర్తులు అన్నారు. శుక్రవారం నాయి బ్రాహ్మణ కమిటీ భవనంలో సమావేశం త్రిమూర్తులు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు వృత్తి శ్రమ హక్కు కార్పొరేటుల సొత్తు కాదన్నారు. కార్పొరేట్ శక్తులు బ్యూటీ పార్లర్ పేరుతో కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి సెలూన్స్ ప్రారంభించి తమ వృత్తి దారులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పారా మెడికల్ వారికి సర్టిఫికెట్ ఉన్న వారే మందులు షాపులు నిర్వహించాలని నిబంధన ఉన్నట్లుగానే నాయీ బ్రాహ్మణ సర్టిఫికెట్ ఉంటేనే సెలూన్ షాపులు ఇచ్చి ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తాటితూరి శ్రీనివాస్,శివన్నారాయణ, ఏ సత్యనారాయణ,కె లోవ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయీ బ్రాహ్మణులు

నేరాలు ఘోరాలు

బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : బాలికపై అత్యాచారం కేసులో నిందితునికి 20ఏళ్ల జైలుశిక్ష, రూ.75వేల జరిమానా విధిస్తూ బాలబాలికల లైంగిక కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పైడి మంగకుమారి శుక్రవారం తీర్పుచెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు సాదారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

కేసులో బాధితురాలి తరపున వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్‌ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలివి. అల్లూరిజిల్లా పెదబయలు మండలం చెరువువీధికి చెందిన నిందితుడు కొర్రా రంజిత్ కుమార్ అదే గ్రామానికి చెందిన బాలికను 2020 అక్టోబర్ 13న నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తర్వాత బాలికను వారి ఇంటి వద్దకు చేర్చాడు. అయితే రక్తస్రావమౌతున్న బాలికను గుర్తించిన తల్లిదండ్రులు స్థానిక పిహెచ్‌సికి తీసుకెళ్లి వైద్యం చేయించడంతోపాటు ఆరా తీయడంతో జరిగిన ఘోరం తెలిసింది. వెంటనే గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా నేరాన్ని ఒప్పుకున్న నిందితుడు పరారయ్యాడు. దీనిపై బాధిత బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి పాడేరు డిఎస్‌పి బివి.రాజ్‌కమల్ కేసు దర్యాప్తు చేపట్టి, నేరాభియోగ పత్రాలను కోర్టులో దాఖలు చేశారు. కేసు విచారించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఈ మేరకు తీర్పునిచ్చారు. బాధిత బాలికకు రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు పరిహారం ఇవ్వాలని, నిందితుడికి జరిమానాగా విధించిన రూ.75వేలను కూడా బాలికకు ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధి గోస్తనీ గెడ్డలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు స్థానిక ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు. కాశీపట్నానికి దిగువలో గెడ్డ వద్ద మృతదేహం ఉన్నట్లు స్థానికు ల సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుని వయస్సు 40-45 సంవత్సరాలు మధ్య ఉండవచ్చునని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోస్టుమార్టం నిమిత్తం ఎస్ కోట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామని తెలిపారు,

గంజాయితో నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ : గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తరలిస్తున్న నలుగురు వ్యక్తులను ఆరిలోవ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి మూడు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టులో హజరు పరిచారు. ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలివి. దాడిశెట్టి గిరిధర్, పండవ ప్రేమ్ కుమార్, బూసి నరేష్ కుమార్, డెంగల సన్ని బాబు శనివారం మధ్యాహ్నం విశాఖ వేలీ స్కూలు పక్కన గల నీలగిరి తోటలో గంజాయి కలిగి ఉన్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ రామదాసు, మరికొంత సిబ్బంది మాటు వేసి వారిని పట్టుకున్నారు. నిందితులను నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు.

ఆధార్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: అందుబాటులోకి మొబైల్ ఆధార్‌ను ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ కోరారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, ట్రైయిని కలెక్టర్ కె.సాహిత్‌లు ఆధార్ కిట్లు జిల్లాలోని గిరిజనుడికి సేవలు అందించుటకు గాను అందజేశారు. సిరీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ సంస్థ ట్రైబల్ ఏరియాలో మొదటి ట్రైబల్ సంస్థగా గుర్తింపు పొందినది. ప్రతి మండల గ్రామ సచివాలయంలో వీరి ఆధార్ సేవలు ప్రారంభం కానున్నాయి. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ కూడా ఈ ఆధార్ సేవల్ని వినియోగించుకోవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పిఎంయు అధికారి రేజెటి గోపాల్, ఆధార్ కో ఆర్డినేటర్ డేవిడ్, సిబ్బంది పాల్గొన్నారు

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని పందిరిమామిడి గ్రామంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పాల్గొన్నారు. కూటమి పార్టీల నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రోగుల పట్ల స్నేహభావంతో ఉండాలి

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



ఆసుపత్రి లో రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే...

ప్రజాశక్తి రంపచోడవరం : రోగుల పట్ల వైద్యులు స్నేహభావంతో మెలగాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని శుక్రవారం ఆమె సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. భోజన నాణ్యత బాగోలేదని కాంట్రాక్టర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి, రోగులకు సకాలంలో వైద్యం అందించాలని సూచించారు. వైద్యులకు ఎటువంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం మండలంలోని గురుకుల కళాశాల, పాఠశాలలను సందర్శించారు. అక్కడ మెనూ ప్రకారంగా సక్రమంగా భోజనం పెడుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పే విధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత వర్షాలు దృష్ట్యా సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాచి, చల్లార్చిన నీటిని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కొల్లుబోయిన శ్రీనివాస్ యాదవ్, టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్ బాబు, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, ఏఎంసి వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, మాజీ మండల అధ్యక్షులు అడబాల బాపిరాజు, మాజీ సర్పంచ్ వై.నిరంజనీదేవి, బాపన్న దొర, చోటు సింహాచలం, జి చిన్నబాబు, పండా చెల్లన్న దొర, వెంకన్న దొర, సురేష్, గణపతి, రమణ, జనసేన పార్టీ నాయకులు శ్రీనివాసరావు, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజారావు నాలుగో వర్ధంతి

ప్రజాశక్తి-రంపచోడవరం : భూమికోసం భుక్తి కోసం ప్రతిఘటన పోరాటాలే శరణ్యమని నమ్మి జీవితాంతం పోరాడి అసువులుబాసిన కామ్రేడ్ ఎస్.రాజారావు నాలుగో వర్ధంతి రంపచోడవరంలో మార్క్స్ యాంగిల్స్ భవన్లో సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. పార్టీ డివిజన్ కార్యదర్శి కుంజా దూలయ్య మాట్లాడుతూ రాజారావు ఆదివాసీల దళిత పీడిత ప్రజల కోసం హక్కుల కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు



వర్ధంతి సభలో మాట్లాడుతున్న కుంజా దూలయ్య